# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు



WANTED విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745





సంపుటి : 01 | సంచిక : 173 | వరంగల్ | శనివారం, 28 మార్చి 2026 | పేజీలు : 02




# శ్రీరామస్మరణలతో మార్మోగిన వల్మిడి

- ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే
- వైభవంగా సీతారాముల కళ్యాణం ఉత్సవం

**పాలకుర్తి, పాలకుర్తి వాణి:** వల్మిడి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణ మహోత్సవం అట్టహాసంగా కొనసాగింది. చారిత్రక గుట్ట శ్రీరామ నామస్మరణలతో మారుమోగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పోటెత్తారు. రాములూరి కళ్యాణాన్ని కనులారా చూసి పులకించిపోయారు. స్థానిక శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి  ఆధ్వర్యంలో ఘనంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ ప్రసిద్ధిగాంచిన ఉత్సవాన్ని దర్శించేందుకు పరిసర ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు, పుస్తె మెట్టలు సమర్పించి సంప్రదాయబద్ధంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకి  పూర్ణకుంభంతో స్వాగతం పలికారు, వేద మంత్రోచ్చారణల నడుమ, పండితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహా అన్నదానం నిర్వహించారు







దాతను ఆహ్వానించి

# అవమానపరిచారు

**సర్వత్ర చర్చనీయాంశంగా మారిన సంఘటన**



**పాలకుర్తి, పాలకుర్తి వాణి:** శ్రీరామనవమి పురస్కరించుకొని పాలకుర్తి మండలం వల్మిడిలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఓ దాతకు తీవ్ర అవమానం జరిగింది. ఆహ్వానించి దైవదర్శనికి వెళ్లనీయకుండా సిబ్బంది అడ్డుకున్నారు. సాధారణ భక్తునిగా వెళ్లవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రాముల వారి కల్యాణాన్ని తిలకించడం కోసం అనుమతి ఇవ్వలేదని దాత వెంకన్న తెలిపారు. ఆలయ అభివృద్ధికి విరాళాలు అందించాలని పదేపదే కోరిన అధికారులు రాములవారి కళ్యాణోత్సవంలో ఎందుకు పట్టించుకోలేదని అన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వీరమల్ల వెంకన్న గతంలో సీతారాముల చంద్రస్వామికి లక్ష ఇరవై వేలతో అశ్వవాహనము, టేబుల్ ఫ్యాన్లు, 20 వేల ఖర్చుతో ఆలయానికి విరాళం అందజేశారు. మరోసారి 2,20,000 విరాళాన్ని దాత సమర్పించారు. శుక్రవారం దేవదాయశాఖ సిబ్బంది కళ్యాణవేదిక దగ్గరికి అనుమతించకుండా అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండోమెంట్ అధికారులు ఇలా చేస్తే దేవుడికి సహాయ సహకారాలు ఎలా అందుతాయని వాపోయారు.



# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పాలకుర్తి పీహెచ్‌సీలో తనిఖీలు

2

# నాణ్యమైన చికిత్స అందించాలి

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి :** ప్రజలకు వైద్యులు మెరుగైన చికిత్సను అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని పాలకుర్తి మండల కేంద్రం పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. మందుల గది, ల్యాబ్, ఇన్ పేషెంట్ విభాగం, స్టాక్ రిజిస్టర్, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించి, రోజూవారి రోగుల సంఖ్య, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే తరచూ వచ్చే కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారిణి ఉష పాల్గొన్నారు.

## వంట, ఉడికింపు విధానాలపై ఆదేశాలు



పాలకుర్తి మండల కేంద్రం పరిధిలో గల సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ (బాలికల) పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కిచెన్ (వంటశాల)ను, భోజనశాలను ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై కలెక్టర్ సమగ్ర తనిఖీ నిర్వహించారు.

### తాటి చెట్టుపై నుంచి పడి

# గీత కార్మికుడికి గాయాలు



**పాలకుర్తి, పాలకుర్తి వాణి:** మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన కోతి అనిల్ గీత కార్మికుడిగా జీవనం కొనసాగిస్తున్నారు. దైనందిన జీవన వృత్తిలో భాగంగా శుక్రవారం తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డారు. ఈ సంఘటనలో అనిల్ ను తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి సపర్యల అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. రెండు చేతులు విరిగినట్లు తెలుస్తోంది.



# ఇరవెన్నులో సీతారాముల కళ్యాణం

**పాలకుర్తి, పాలకుర్తి వాణి:** జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఇరవెన్నులో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణాన్ని తిలకించారు. కళ్యాణా అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు బియ్యం అందజేత

**గూడూరు, పాలకుర్తి వాణి :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఏపూరు టేకులతండాకు చెందిన కాంగ్రెస్ మండల యూత్ నాయకులు అవుల సందీప్ రెడ్డి తల్లి రామ (45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబానికి ఎన్టివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ రామన్న నాయక్ పరామర్శించారు. 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బానోత్ చందా, కాంగ్రెస్ వార్డు సభ్యులు బానోత్ ఈశ్వర్, మాజీ వార్డు సభ్యులు బానోత్ జయరాం, ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# గడ్డి మందును నిషేధించండి

■ **లోక్‌సభలో వరంగల్ ఎంపీ కడియం కావ్య డిమాండ్**



**హైదరాబాద్, పాలకుర్తి వాణి :** పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ రసాయనం వల్ల పర్యావరణం , మానవ ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను వివరించారు. పారాక్వాట్ డైక్లోరైడ్ కేవలం కలుపు మొక్కలను నివారించే రసాయనం మాత్రమే కాదని, ఇది నేల, నీరు, గాలిని తీవ్రంగా కలుషితం చేస్తోందని ఎంపీ స్పష్టం చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో దీని మితిమీరిన వాడకం వల్ల భూసారం దెబ్బ తినడమే కాకుండా.. భూగర్భ జలాలు కూడా విషతుల్యం అవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా ఆహారపు గొలుసులోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ గడ్డి మందు ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారడం అత్యంత కీలకమైన అంశం అని అన్నారు. చిన్నపాటి మనస్పర్థలు లేదా క్షణికావేశంలో ఈ రసాయనాన్ని సేవించిన వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె పేర్కొన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో మరణాల రేటు దాదాపు 100 శాతం ఉండటం అత్యంత భయానకమైన విషయం. దీనికి ఇప్పటివరకు ఎటువంటి విరుగుడు అందుబాటులో లేకపోవడం వల్ల ఆసుపత్రికి చేరినా ప్రాణాలు కాపాడటం అసాధ్యంగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ సహా తెలంగాణలోని అనేక జిల్లాల్లో పారాక్వాట్ వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని ఎంపీ వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పలువురు వైద్య నిపుణులు కూడా ఈ రసాయనం వల్ల కలిగే ముప్పును గుర్తించి, దీనిపై నిషేధం విధించాలని ఇప్పటికే గళమెత్తారు. ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే వేరే ఏదీ ముఖ్యం కాదని, అందుకే కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీని తయారీ, అమ్మకాలు , వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన ఇటువంటి రసాయనాలకు బదులుగా పర్యావరణహితమైన, సురక్షితమైన ప్రత్యామ్నాయాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని.. ఈ దిశగా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు.

# కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్




**జనగామ, పాలకుర్తి వాణి :** జనగామ జిల్లాలో గ్యాస్ సిలిండర్లపై ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని జిల్లా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. ఆయన వెంట కొడకల్లా డిటిసిఎస్ లచ్చు నాయక్, సంబంధిత అధికారులు ఉన్నారు.

# కూలిన కళ్యాణోత్సవ వేదిక

■ **ఎమ్మెల్యే వేములకు తృటిలో తప్పిన ప్రమాదం**

**నల్లగొండ, పాలకుర్తి వాణి :** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశంకు తృటిలో ప్రమాదం తప్పింది. కేతేపల్లి మండలం బండపాలెంలో శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదిక అకస్మాత్తుగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ఈ వేడుకల్లో పాల్గొని వెళ్లిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగింది. సీతారాముల కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇలాంటి సమయంలో వేదిక కూలడంతో భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ అపశృతి జరిగిందంటూ తీవ్రంగా విమర్శించారు.

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341